ప్రజాశక్తి

ఆదివారం 2 మార్చి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రేపు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- 28 టేబుళ్లు ఏర్పాటు
- 900 మంది సిబ్బంది నియామకం
- సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ
- మొదటి ప్రాధాన్యత ఓటుపై ఉత్కంఠ !

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజక వర్గం ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. ఫిబ్రవరి 27న జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్లను లెక్కించేందుకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుంటూరు ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఇప్పటికే 483 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను భారీ బందోబస్తు మధ్య భద్రపరిచారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చారు. మొత్తం 25 మంది

గుంటూరు ఎసి కాలేజీలో కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుల్స్

అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ప్రధాన పోటీ టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పిడిఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్‌సి కె.ఎస్ లక్ష్మణరావు మధ్యే నెలకొంది. దీంతో మొదటి ప్రాధాన్యత ఓటుపై తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది. ఎంఎల్‌సి ఎన్నికల్లో పోలింగ్ శాతం భారీగా పెరగటంతో ఓట్ల లెక్కింపు సోమవారంతో పూర్తయ్యే అవకాశం లేదని, మంగళవారం కూడా కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 3,47,116 మంది ఉండగా, 2,41,502 మంది ఓటు వేశారు. మొత్తంగా 59.57 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈనేపథ్యంలో ఓట్ల లెక్కింపునకు మొత్తం 28 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపులో దాదాపు 900 మంది పాల్గొననున్నారు. మొత్తం మూడు విడతలుగా లెక్కింపు సిబ్బంది విధులకు హాజరు కానున్నారు. ప్రతి టేబుల్ వద్ద ఉండే లెక్కింపు సిబ్బందితోపాటు టేబుల్ సూపర్ వైజర్, రో ఇన్చార్జి (టేబుల్ లైన్), సూపర్ వైజర్ పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని రిటర్నింగ్ ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నందున మొదటి ప్రాధాన్యత ఓటు ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో లెక్కింపుపై

2 లో

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.ఒ, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి వేదికపైన ఇతర అధికారులు

కౌంటింగ్ ప్రక్రియ అప్రమత్తతంగా చేపట్టాలి

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి శిక్షణలో ఆర్.ఒ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియ నిరంతరం అప్రమత్తతతో చేపట్టాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉద్యోగులు, పర్యవేక్షణాది కారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఏసి కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌లో రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ , తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్‌తో కలసి ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ విధులు కేటాంచబడిన ఓట్లు లెక్కింపు సిబ్బంది, టేబుల్ సూపర్వైజర్లు, రోఇన్చార్జ్‌లు, పర్యవేక్షణ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్లు లెక్కింపులో పూర్తి ఏకగ్రతతో సమర్థవంతంగా కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. చెల్లుబాటు అయ్యే ఓట్లు, చెల్లని ఓట్లకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలపై కౌంటింగ్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండి కౌంటింగ్ సమయంలో ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. టేబుల్ సూపర్వైజర్లు, రో ఇన్‌చార్జులు నిరంతరం కౌంటింగ్ విధానాన్ని పర్యవేక్షిస్తూ కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన సూచనలు, సహాయం అందించాలన్నారు. బ్యాలెట్ బ్యాక్సులు ఓపెన్ చేయటం, బండ్లింగ్ చేయటం, లెక్కించటం ప్రక్రియల నిర్వహిణలో నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పేపరు, మొదటి ప్రాధాన్యత ఓటు నమోదు విధానం ద్వారా జరుగుతున్న నేపథ్యంలో ఓట్లు లెక్కింపు చాలా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు సమయానికి నిర్దేశిత ఆధిక్యం రాకపోతే, పోటీలో ఉన్న అతి తక్కువ మెజార్టీ వచ్చిన అభ్యర్దుల ఓట్లలో తదుపరి ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు కేటాయిస్తూ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ

2లో

దాచేపల్లిలో రూ.11లక్షలు లబ్దిదారులకు

పంచాల్సిన సొమ్ముతో పరార్

వార్డు వెల్ఫేర్ కార్యదర్శిపై కమిషనర్ ఫిర్యాదు

ప్రజాశక్తి-దాచేపల్లి

పింఛన్, సర్వీస్ రిక్వెస్ట్ డబ్బులతో వార్డు సచివాలయ అధికారి పరారి అయిన ఘటన శనివారం దాచేపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. దాచేపల్లి మునిసిపల్ కమిషనర్ అప్పారావు ఫిర్యాదు మేరకు దాచేపల్లి స్టేషన్లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంపతి లక్ష్మి ప్రసాద్ దాచేపల్లి మున్సిపాలిటీ మూడవ సచివాలయంలో వార్డ్ వెల్ఫేర్ కార్యదర్శిగా ఇటీవల బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ భరోసా కింద శనివారం వృద్ధులు వికలాంగులు, వితంతు, తదితర పింఛన్లను లబ్ధిదారులకు అందచేయాల్సి ఉంది. కానీ శుక్రవారం బ్యాంకులో డ్రా చేసిన రూ. 8,43,000 వేలతో పాటు సర్వీస్ రిక్వెస్టులో వచ్చిన 2,67,000 లావాదేవీలను స్థానిక మున్సిపాలిటీకి అప్పజెప్పాల్సి ఉంది. కానీ ఆనగదును మున్సిపాల్టీకి అప్పచెప్పలేదు. బ్యాంకు నుండి నగదు తీసుకురావాల్సిన లక్ష్మీ ప్రసాద్ ఆచూకి లభించక పోవడం, అతను సచివాలయానికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వార్డ్ వెల్ఫేర్ కార్యదర్శి పెన్షన్ల సొమ్ముతోపాటు, సర్వీస్ రిక్వెస్ట్ డబ్బుతో పరారయ్యాడని దాచేపల్లి మున్సిపల్ కమిషనర్ అప్పారావు స్థానిక దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

మొదటి రోజు 97.59 శాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభం అయ్యాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలుగానీ, మాల్ ప్రాక్టీస్ కేసులుగానీ నమోదు కాలేదని ఇంటర్ బోర్డు రీజినల్ ఇనెస్పెక్షన్ ఆఫీసర్ జి.కె.జుబేర్ తెలిపారు. మొదటి రోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 33,783 మంది, 1287 మంది మొత్తం 35,070 మందికిగాను 34,227 మంది హాజరయ్యారు. 843 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షల కోసం ఏర్పాటు చేసిన 87 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేశారు. సిసి కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. పరీక్షల్లో కాపీయింగ్‌ను అరికట్టేందుకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ద్వారా తనిఖీలు చేపట్టారు. ఇంటర్ ఆర్ఐఒ పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. సోమవారం ద్వితీయ సంవత్సరం లాంగ్వేజ్-2 పరీక్ష నిర్వహించనున్నారు.

నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కాలేజీలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

గుంటూరులో టిజెపిఎస్ కాలేజ వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్.పి కె.

2లో

ఎన్ఎస్‌పీ ఎస్ఈపై సస్పెన్షన్ వేటు

4 లో

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

స్కానింగ్ సెంటర్లకు పల్నాడు కలెక్టర్ హెచ్చరిక

4 లో

టిడిపి అరాచకాల పై అధికారుల ప్రేక్షక పాత్ర!

వీక్షణం

8 లో

రేపు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)

నిశిత పరిశీలన చేయాల్సి ఉంటుంది. మొదటి ప్రాధాన్యతలో విజయం సాధించాలంటే మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం ఓట్లు కన్నా ఒక్క ఓటు అదనంగా రావాలి. ఈనేపథ్యంలో మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి నిర్దేశిత ఆధిక్యత రానప్పుడు పోటీలో ఉన్న అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థుల తదుపరి ప్రాధాన్యత ఓట్లను పరిగణలోకి తీసుకుంటూ దిగువ నుంచి ఎలిమినేషన్ ప్రాసెస్‌లో లెక్కింపు ప్రక్రియను కొనసాగిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లకు సరిపోను 50 శాతానికి మించి ఓట్లు రానప్పుడు రెండో ప్రాధాన్యతలో అభ్యర్థులు గెలుపొందే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో కౌంటింగ్ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగే అవకాశం ఉంది. 2007, 2013, 2019లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా లెక్కింపు ప్రారంభమైన తర్వాత రెండో రోజు సాయంత్రానికి ఫలితాలు ఖరారయ్యాయి. ఇదే రీతిలో ఈసారి కూడా మంగళవారం తుది ఫలితాలు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మొదటి ప్రాధాన్యతలో ఏమాత్రం తేడా వచ్చినా తదుపరి ఆధిత్యంలో ఉన్న అభ్యర్థి రీకౌంటింగ్ కోరితే మొత్తం ప్రక్రియలో తీవ్రజాప్యం జరిగే అవకాశం ఉంది.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాసరావు అదేశించారు. పల్నాడు జిల్లాలో 48 సెంటర్లలో శనివారం ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పరీక్షల నేపథ్యంలో నరసరావుపేట పట్టణం లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్.పి ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వర్తించాలన్నారు.పరీక్షలు పూర్తయ్యే వరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. అభ్యర్థులకు నిర్దేశించిన సమయం లోపు పరీక్ష కేంద్రాల లోనికి అనుమతించాలన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి సెల్ ఫోన్, స్మార్ట్ వాచ్, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాల అనుమతికి వీల్లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున అభ్యర్థులు మినహా ఇతరులను అనుమతించరాదని సూచించారు.పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు ముగిసే వరకు మూసి వేయించాలన్నారు. అదనపు ఎస్.పి జెవి సంతోష్, నరసరావుపేట 1 వ పట్టణ సిఐ ఎంవి చరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియ అప్రమత్తంగా చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు 483 పోలింగ్ బూత్‌లలో నిర్వహిస్తున్నందున ఓట్లు లెక్కింపునకు 28 టేబుల్స్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సిబ్బందితోపాటు, టేబుల్ సూపర్వైజర్, రోఇన్చార్జి, షిఫ్ట్ ఇన్చార్జి ని నియమించటం జరిగిందన్నారు. మూడు షిఫ్టులలో ఉద్యోగులను నియమించటం జరిగిందన్నారు. కౌంటింగ్ టేబుల్ వద్దకు వచ్చిన బ్యాలెట్ బ్యాక్సులను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సీల్, ఫారాలు తనిఖీ చేసి, అభ్యర్థుల ఏజెంట్లకు చూపించి బ్యాలెట్ పేపర్లను వెలుపలకి తీయాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కింపు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన విధానాలపై జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.జేసీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చిన బ్యాలెట్ బాక్సులు తీసుకువచ్చినప్పుడు పోలింగ్ కేంద్రం, పోలైన ఓట్లు, తదితర వివరాలు పూర్తిగా సరిచూసుకొని బాక్సులు ఓపెన్ చేసి కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల , ఎన్టీఆర్ జిల్లాల డిఆర్ఓలు ఎన్.ఎస్.కే ఖాజావలి, మురళి, గంగాధరగౌడ్ , చంద్రశేఖర్, ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు అందరూ సహకరించాలి

ప్రజాశక్తి - పెదకాకాని

అంధత్వ నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని శంకర కంటి ఆసుపత్రి ప్రధాన వైద్యులు సుధాకర్ పొట్టి పిలుపునిచ్చారు. శంకర కంటి ఆసుపత్రి 21 వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 138 నేత్ర దాతలతో 276 మందికి తిరిగి కంటి చూపు తేవడంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషించారన్నారు. 2024 సంవత్సరంలో లక్ష నలభై వేల మందికి పొరుగు సేవా విభాగాలలో సేవలు అందించగా 45,429 మందికి శస్త్ర చికిత్సలు చేశామన్నారు. ఆసుపత్రి స్థాపించిన నాటి నుండి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యాక్రమంలో డాక్టర్ మందల రత్నగిరి బాబు, డాక్టర్ కౌషిక్ మురళి, యూనిట్ హెడ్స్ త్రిపుర, మాధవి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల3వ తేదీన స్థానిక ఏ.సి కళాశాలలో చేపడుతున్న కౌంటింగ్ ఏర్పాట్లను, స్ట్రాంగ్‌రూము, ట్రాఫిక్ రూట్‌కు సంబంధించి ఏర్పాట్లను శనివారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. బ్యాలెట్ కౌంటింగ్‌కు సంబంధించి ఏ.సి కాలేజీలోని ప్రేయర్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లను పరిశీలించి తగు సూచనలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కె.శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహశీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ, ఇతర అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక బృందాల తనిఖీలు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల నియోజకవర్గంలో రహదారులపై జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి.. అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై పల్నాడు జిల్లా ప్రత్యేక అధికారులు, స్థానిక అధికారులతో కలిసి మూడు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల బారిన పడి ఏడాదికి 500 మంది వరకు మరిణిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు రోడ్డు సేఫ్టీ నోడల్ అధికారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్‌తోపాటు, ఆర్అండ్‌బీ, పోలీసు శాఖల సిబ్బంది, అధికారుల బృందం యాక్సిడెంట్ జోన్‌లుగా గుర్తించిన ప్రదేశాలను పరిశీలించారు. చేపట్టాల్సిన చర్యలపై కింది స్థాయి అధికారులకు సూచనలు చేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రమాదాల నివారణకు ప్రధాన రహదారులపై యాక్సిడెంట్ జోన్స్‌గా గుర్తించిన ప్రదేశాలలో సోలార్ బ్లింకర్స్, సోలార్ స్టడ్స్, రంబుల్ స్టిప్స్, రోడ్డు మార్కింగ్, ఇల్లిమ్యూనేషన్ లాంటి ఆధునాతన సేఫ్టీ మేజర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు చెబుతున్నారు. రహదారి ప్రమాదాలపై అవగాహన పెంచడంతోపాటు, నిబంధనలు ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు కూడా ఉంటాయని అంటున్నారు. మాచర్ల నియోజకవర్గంలో రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలు అధిక సంఖ్యలో ఉన్నట్లు చెప్పారు. ప్రతి మండలంలో ఐదారు ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ తనిఖీ బృందంలో నేషనల్ హైవే అధికారులు కూడా పాల్గొన్నారు.

ఇటివల సాగర్ రోడ్డులో ప్రమాదం జరిగిన దృశ్యం(ఫైల్)

మానవ తప్పిదాల వల్లే రహదారి ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మానవ తప్పిదాల వల్లేనని.. అందులో ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లేనని పోలీసు అధికారులు భావిస్తున్నారు. రహదారి వెంట మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఎక్కువగా లేకపోవడం వల్ల మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయే వారిలో అధిక శాతం ద్విచక్ర వాహనదారులతోపాటు రెక్కాడితే గానీ డొక్కాడని రోజువారీ కూలీలు లెక్కకు మించి ఆటోల్లో, మినీ లారీల్లో వెళుతూ ప్రమాదాలకు గురై చనిపోతున్నారు. పట్టణాల్లో రోడ్డు మార్జిన్స్‌లో పాదచారులకు నడిచేందుకు స్థలం లేకుండా చిరు వ్యాపారులు ఆక్రమించడంతో రోడ్డుపైన పాదచారులు నడుస్తున్నారు. దీని వల్ల రోడ్డుపై నడిచే వారిని వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఏ మేరకు సత్ఫలితాలిస్తాయో చూడాలి.

మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు, మౌలిక వసతుల కల్పన చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శనివారం టెలీకాన్ఫరెన్స్ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు ప్రతిరోజూ మసీదుల వద్దకు అధిక సంఖ్యలో ప్రార్ధనల కోసం వస్తారని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని శానిటరీ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు.మసీదుల వద్ద నీటిసదు పాయం, వీధి దీపాల ఏర్పాటు ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మసీదుల వద్ద పారిశుధ్య సమస్యలు గుర్తిస్తే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయ వచ్చని తెలిపారు.

నేడు ఊపిరితిత్తుల వ్యాధులపై ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ గత పదిహేను సంవత్సరములుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్య సభలలో భాగంగా నేడు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులపై ఉదయం 11 గంటలకు అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని అవగాహన కార్యాలయంలో సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ప్రముఖ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్.రఘు ప్రధాన వక్తగా పాల్గొంటారని, అలర్జీ, ఆస్తమా, ఆయాసం, సిఓపిడి, నెమ్ము, హెచ్ఐవి, చాతినొప్పులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ, సీజనల్ వ్యాధులు తదితరాలపై డాక్టర్ రఘు మాట్లాడతారని తెలిపారు. కావున ఆరోగ్యాభిలాషులు అందరూ పాల్గొని వినియోగించుకోవాలని కోరారు.

అనధికార మాంస విక్రయాలను చేయకూడదు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోని రోడ్లపై నాటుకోళ్లు, చేపల మాంస అనధికార విక్రయాలు జరగకుండా ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం టెలి కాన్ఫరెన్స్ ప్రజారోగ్యాధికారులతో మాట్లాడుతూ నగరంలోని ప్రధాన, అంతర్గత రోడ్లపై అనధికారిక నాటుకోళ్లు, చేపలు, మాంస విక్రయాలు జరగకుండా ప్రజారోగ్య అధికారులు పటిష్ట చర్యలుతీసుకోవాలన్నారు. అనధికార విక్రయాలు చేసే వారికి భారీ మొత్తంలోఅపరాధ రుసుం విధించటమే కాకుండా చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మాంస విక్రయదారులు తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుండి డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్ పొంది వ్యాపారం నిర్వహించుకోవాలన్నారు. లైసెన్స్ లేని షాపులను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అనధికార మాంస విక్రయాలను అరికట్టడానికి శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు బందాలుగా ఏర్పడి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అలాగే మాంస విక్రయ షాపుల యజమానులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మాంసంపై దుమ్ము, ధూళి పడకుండా మెస్ లను కట్టి ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాలన్నారు.

ప్రజలు హౌస్ హోల్డ్ డేటా నమోదుకు సహకరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నివాసం ఉండే ప్రతి ఒక్కరూ స్థానిక వార్డు సచివాలయం హౌస్‌హోల్డ్ డేటాలో తప్పనిసరిగా నమోదై ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మిస్సింగ్ సిటిజన్ సర్వే చేపట్టిందని, అందులో భాగంగా నగరంలో నివసించే ప్రతి ఒక్కరినీ స్థానిక వార్డుసచివాలయం పరిధిలో హౌస్‌హోల్డ్ డేటాలో నమోదు చేయడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. డేటాలో ప్రభుత్వ ఉద్యోగులతో సహా నగరంలోని ప్రతి ఒక్కరూ నమోదు కావాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్ లో భూ పట్టాలు, అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాలు, పాస్‌పోర్ట్, ఆధార్ సేవలు, పురసేవలు అందడానికి హౌస్ హెూల్డ్ డేటాలో నమోదు తప్పనిసరి అని అన్నారు. ప్రభుత్వ సేవలు, సమాచారం, సంక్షేమ పథకాలు అందించడానికి కూడా డేటా ప్రధానమైనదని తెలిపారు. అపార్ట్మెంట్, గేటెడ్ కమ్యూనిటీ గ్రూప్ హౌస్‌లో ఉండేవారిలో ఎక్కువ మంది మిస్సింగ్ సిటిజన్ కేటగిరిలో ఉన్నారని, అటువంటి వారు తమ వద్దకు వచ్చే సచివాలయ కార్యదర్శులకు తగిన సమాచారం అందించి సహకరించడం ద్వారా హౌస్‌హెూల్డ్ డేటాలో నమోదు కావాలని, సదరు నమోదుపై ఏ విధమైన అపోహలు పెట్టుకోవద్దని కోరారు.

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి శుక్రవారం తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో గుంటూరు జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ బెంచెస్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో వారు ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం కొన్ని రాజీ పడదగిన కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా, చెక్ బౌన్స్, ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ఆస్తి వివాదంలో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి తెనాలి

ఆస్థి వివాదంలో వ్యక్తిపై దాడి ఘటనలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన శివనాయక్‌కు ఇంటి స్థలం విషయమై అతని తమ్ముడితో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో శివనాయక్‌పై అతని తమ్ముడి కొడుకు కార్తీక్ నాయక్ శనివారం కత్తితో దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్ఐ ప్రకాశరావు తెలిపారు.

మాదిగ మృతవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాదిగల హక్కుల పోరాటంలో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. రూరల్ మండలం కొలకలూరు ప్రధాన కూడలిలో శనివారం ఏర్పాటు చేసిన మాదిగ అమరవీరుల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ధర్మారావు మాదిగ మాట్లాడుతూ మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ కూచిపూడి మోహన్ మాదిగ మాట్లాడుతూ మాదిగల సంక్షేమం కోసం ప్రాణాలర్పించిన మృతవీరులు చరిత్రలో నిలిచిపోతారన్నారు.

చెత్త సేకరణ పనులు పరిశీలించిన అధికారి

పనులు పరిశీలిస్తున్న పంచాయతీ అధికారి విజయభాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి నకరికల్లు

గ్రామాలలో ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్య పనులు చేయాలని పల్నాడు జిల్లా గ్రామపంచాయతీ అధికారి ఎం. విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. నకరికల్లోని చెత్త సేకరణ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆదేవిధంగా రోడ్డు మార్జిన్ నందు చెత్త కుప్పలను వెంటనే తొలగించి చెత్త సంపద తయారీ కేంద్రం వద్దకు చేర్చాలన్నారు. గ్రామంలో చెత్త సంపద కేంద్రం ఉన్నదని ప్రతి ఒక్కరికి తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి కొమ్మవరపు శివప్రసాద్ ,గ్రీన్ అంబాసిడర్ లు ప్రజారోగ్య సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

జిల్లా ఖజానా అధికారిగా కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా ఖజానా, అకౌంట్స్ అధికారి (ఎఫ్.ఎ.సి)గా కె.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సిఎం ఫొటోకి కేంద్ర మంత్రి పెమ్మసాని పాలాభిషేకం

ప్రజాశక్తి ప్రత్తిపాడు:

2025 - 2026 ఆర్థిక సంవత్స రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్‌లో ప్రత్తి పాడు నియోజక వర్గ రైతాం గానికి గుంటూరు ఛానల్ భూసే కరణకు బడ్జెట్‌లో వంద కోట్లు నిధులు కేటాయించినందుకు గాను హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటానికి కేంద్ర సహాయక మంత్రి పెమ్మ సాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు, మాజీ మంత్రి మాకినేని పెద రత్తయ్య పాలాభి షేకం చేసి కూటమి ప్రభు త్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అర్థ శతాబ్దపు అన్నదాతల కల అయిన గుంటూరు ఛానల్‌ను ప్రత్తిపాడు వాసులకు అందించడంలో సహకరించిన ముఖ్యమంత్రికి ధన్య వాదా లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మాకినేని పెద్దరత్తయ్య వట్టి చెరుకూరు మండల పార్టీ నాయ కులు ఎం. పూర్ణ చంద్రరావు ప్రత్తిపాడు మండల ప్రెసిడెంట్ జి. శివరాం ప్రసాద్, పెద నందిపాడు మండల ప్రెసిడెంట్ హనుమంతరావు, కాకుమాను మండలం ప్రెసిడెంట్ సునీల్ కుమార్, గుంటూరు రూరల్ మండల ప్రెసిడెంట్ భీమినిమల్లి రాష్ట్ర మీడియా కో ఆర్డి నేటర్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి పెమ్మసాని

ప్రమాదంలో మృతి చెందిన ప్రసన్న

కారు బోల్తా పడి మహిళ మృతి

విజయపురిసౌత్:

హైదరాబాద్ నుంచి మాచర్ల వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడటంతో కారులో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందిన సంఘటన మాచర్ల మండలం భైరవునిపాడు సమీపంలోని కొత్తపల్లి డొంకరోడ్డు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన జాల ప్రసన్న (35) తన భర్త ప్రకాష్‌తో కలసి గత నెల 19న హైదరాబాద్ లోని ఆసుపత్రికి వెళ్లారు. అనంతరం గత శుక్రవారం రాత్రి 9:30 గంటలకు హైదరాబాద్ నుంచి భార్య భర్తలు కారులో ఒప్పిచర్ల కు బయలుదేరారు.మాచర్ల పట్టణ సమీపంలో కొత్తపల్లి డొంకరోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు డొంకరోడ్డులోని దూసుకు పోయింది. దీనితో కారులో ఉన్న ప్రసన్న కిందపడటంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి.కొద్దిసేపటికే ఆమె మృతి చెందింది.కారు నడుపుతున్న భర్త ప్రకాష్ కు ఎటువంటి గాయాలు కాలేదు.పోలీసులు మృతురాలిని పోస్ట్ మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయ పురిసౌత్ ఎస్ ఐ షేక్ మహమ్మద్ షఫీ తెలిపారు.

ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ పోయినది

పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామానికి చెందిన కుంబా గోపి S/o జగన్మోహనరావు అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా సత్తెనపల్లి ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి పొందిన ఒరిజినల్ సర్టిఫికెట్(హాల్ టిక్కెట్ నెం.1807145101) 7-02-2025 న నరసరావుపేట మెార్ సెంటర్ లో పడిపోయినది.ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్ లో లేదా సెల్ నెం.7989602269 నందు సంప్రదించగలరు.

SUIT SUMMONS
IN THE COURT OF THE HON'BLE PRL. CIVIL JUDGE(JUNIOR DIVISION) ::GUNTUR
O.S.No: 431 / 2023

Between:
Canara Bank,(Erstwhile Syndicate Bank) S.V.N.Colony Branch, Rep.by its Branch Manager. ..... Plaintiff

AND

B.Ajith Kumar& Another ...... Defendants

To,
B.Ajith Kumar, S/o. Brahmanandam, R/o. Door No. 11-4-238, Rajagari Thota, 1st Line, Kothapet, Guntur.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:05-03-2025న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరుచుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:05-03-2025

ఆత్మకూరి ప్రేమసాయి,
వాది తరపు అడ్వకేట్,
6/13 బ్రాడీపేట,గుంటూరు.
సెల్:94926 88463

మహారాజశ్రీ
మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 418/2024

పువ్వాడ శ్రీనివాసులు ....వాది

వర్సెస్

పంగా శ్రీనివాసరాజు .... ప్రతివాది

టు,
పంగా శ్రీనివాసరాజు, తండ్రి: నాగయ్య
నివాసం: 1వ అంతస్తు, ప్లాట్ నెం: 104,
సాయి సంస్కృతి టవర్స్, పాత శివాలయం వీధి,
చెరువుకట్ట,నరసరావుపేట టౌన్, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాలో వాది, మీపై ప్రామిసరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం పైకోర్టులో దావా వేయగా, మీకు సమన్లు జారీ కానందున, కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసి యున్నారు. కావున మీరు స్వయముగా కానీ, వకీలు ద్వారా గానీ తేదీ:13-03-2025న ఉదయం 10:30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీపరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 13-03-2025

ఇ.శారద,
అడ్వకేట్, మార్కాపురం.

పట్టణంలో సంచరిస్తున్న ఆవులు గోశాలకు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : మాచర్ల పురపాలక సంఘ పరిధిలో సంచరిస్తున్న ఆవులను గోశాలకు తరలిస్తున్నట్లు డి. వేణుబాబు శనివారం తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు, ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తున్న ఆవుల విషయంపై ఆవుల యజమానులు వాటిని తమ ఇంటి వద్ద కట్టివేసుకోవాలని లేని పక్షంలో వాటిని అదుపులోకి తీసుకుంటామని పట్టణంలో చాటింపు వేశామన్నారు. అయినా ఆవుల యజమానులు స్పందించలేదన్నారు.దాంతో వీధుల వెంట సంచరించు ఆవులను పట్టి ఉంచటం జరిగినదని, కొంతమని యజమానులు అపరాద రుసుము చెల్లించి ఆవులను తీసుకొని వెళ్ళినారని తెలిపారు. ఇంకా 10 ఆవుల యజమానులు నుండి ఎటువంటి సమాచారము రానందున సదరు ఆవులను గోశాలకు సోమవారం నాడు తరలిస్తున్నట్లు వేణుబాబు తెలియపరిచారు.

పింఛన్లు పంపిణీ చేసిన పీడీ హీరాలాల్ నాయక్

ప్రజాశక్తి నాదెండ్ల : పల్నాడు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హీరాలాల్ నాయక్ శనివారం ఉదయం సాతులూరులో పర్యటించారు. ప్రతి నెల ఒకటవ తారీఖున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో స్వరూప రాణి, ఏపివో రమేష్ బాబు, సిసి సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఇ.పి. నెం. 75/2023 ఇన్
ఓ.యస్. నెం. 234/2020

బిట్వీన్ :
కొల్లి సంజీవరెడ్డి .... డిహెచ్ఆర్
ఎదిరి
తియ్యగూర సుబ్బారెడ్డి .... జెడిఆర్

టు,
జెడిఆర్ :- తియ్యగూర సుబ్బారెడ్డి, తండ్రి మల్లారెడ్డి, నుదురుపాడు గ్రామం, ఫిరంగిపురం మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరు అమలు పిటీషన్‌లో మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది. 19-3-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గానీ హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది : 19-3-2025
సత్తెనపల్లి.

శ్రీ చిట్టా విజయభాస్కరరెడ్డి,
డిహెచ్ఆర్ తరపు న్యాయవాది,
సత్తెనపల్లి - 522 403.

ప్రకటన
మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్), సత్తెనపల్లి.
ఓ.యస్.నెం. 900/2023

బిట్వీన్ :
సందెపోగు జాన్ సూర్యారావు వగైరా ... వాదులు
ఎదిరి
గంగవరపు స్వర్ణలత వగైరా ... ప్రతివాదులు

టు,
డి2) వేమవరపు భారతి, భర్త : లేట్ ప్రసాదరావు, కేరాఫ్ వి.రత్నప్రసాద్, (ప్రభుత్వ టీచర్), టూథరన్‌గిరి, పేపరుమిల్లు ఎదురు, రాజమండ్రి సిటీ.
డి4) ఎనుబర్తి సుగంధ భర్త : జెరిమయ్య, డోర్ నెం. 6-6-16, క్రిస్టియన్‌పేట, 7వ వార్డు, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది. 21-3-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గానీ హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది : 21-3-2025
సత్తెనపల్లి.

శ్రీ చిట్టా విజయభాస్కరరెడ్డి,
డిహెచ్ఆర్ తరపు న్యాయవాది,
సత్తెనపల్లి - 522 403.

ప్రకటన
మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం. 619/2023

బిట్వీన్ :
కొత్త మంగమ్మ ..... వాది
ఎదిరి
కొత్తమాసు తిరుపతమ్మ వగైరా ... ప్రతివాదులు

టు,
డి2) చీమకుర్తి సుబ్బారావు, తండ్రి : బాపయ్య, వ్యాపారం, పాల వెంకాయమ్మ బజారు, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాలోను మరియు పిటీషను ఐ.ఎ. నెం. 1160/2023 లోను మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది. 21-04-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేక వకీలుద్వారా గానీ హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో మీ పై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది : 21-4-2025
సత్తెనపల్లి.

శ్రీ చిట్టా విజయభాస్కరరెడ్డి,
డిహెచ్ఆర్ తరపు న్యాయవాది,
సత్తెనపల్లి - 522 403.

ప్రకటన
మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం. 671/2024

బిట్వీన్ :
పెంగ్యాల ఉరఫ్ పెండ్యాల జయప్రద ..... వాది
ఎదిరి
గోపిశెట్టి అప్పారావు ... ప్రతివాది

టు,
ప్రతివాది : గోపిశెట్టి అప్పారావు, తండ్రి : కోటేశ్వరరావు, విశదల గ్రామం, మేడికొండూరు మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరు దావాలో మరియు పిటీషను ఐ.ఎ. నెం. 1938/2024 లోను శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 23-04-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేక వకీలుద్వారా గానీ హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో మీ పై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది : 23-4-2025
సత్తెనపల్లి.

శ్రీ చిట్టా విజయభాస్కరరెడ్డి,
డిహెచ్ఆర్ తరపు న్యాయవాది,
సత్తెనపల్లి - 522 403.

ప్రకటన
మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం. 670/2024

బిట్వీన్ :
పెంగ్యాల ఉరఫ్ పెండ్యాల సుశీల ..... వాది
ఎదిరి
గోపిశెట్టి అప్పారావు ... ప్రతివాది

టు,
ప్రతివాది : గోపిశెట్టి అప్పారావు, తండ్రి : కోటేశ్వరరావు, విశదల గ్రామం, మేడికొండూరు మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరు దావాలో మరియు పిటీషను ఐ.ఎ. నెం. 1937/2024 లోను శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 22-04-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేక వకీలుద్వారా గానీ హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో మీ పై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది : 22-4-2025
సత్తెనపల్లి.

శ్రీ చిట్టా విజయభాస్కరరెడ్డి,
డిహెచ్ఆర్ తరపు న్యాయవాది,
సత్తెనపల్లి - 522 403.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

స్కానింగ్ సెంటర్లకు కలెక్టర్ అరుణ్ బాబు హెచ్చరిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
పల్నాడు జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. శనివారం జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 175 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద అనుమతులు తీసుకున్నాయని చెప్పారు. వీరందరూ చట్ట ప్రకారం నిబంధనలకు లోబడి పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లాలో కొత్తగా రెండు స్కాన్ సెంటర్లకు, రెండు రెన్యువల్స్‌కు, తొమ్మిది మార్పుల కోసం నమోదు చేసుకున్న వారికి లింగ నిర్ధారణ చట్టం కింద అనుమతులు మంజూరు చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి, నోడల్ అధికారి డాక్టర్ గీతాంజలి, వైద్యులు శోభారాణి, లక్ష్మణరావు, గిరిరాజు, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎన్ఎస్‌పీ ఎస్ఈపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
నాగార్జునసాగర్ ప్రాజెక్టు లింగంగుంట్ల ఆపరేషన్, మెయింటెనెన్స్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకటరమణారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సెలవు తీసుకోకుండానే జిల్లా కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు.. మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలకు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ రైతులకు అందుబాటులో లేకపోవడంపై వారు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను సస్పెండ్ చేశారు.

ఏకాగ్రత, పట్టుదలతో విజయం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్
ప్రతి విద్యార్థి ఏకాగ్రత, పట్టుదలతో విజయాలను సాధించవచ్చునని సీనియర్ మోటివేటర్, సైకాలజిస్ట్ ఎంబీఎస్ కోటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రణాళికబద్ధంగా చదువుకుని పరీక్షలకు హాజరు కావడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో తగినంత సమయం చదువుకు కేటాయించి, ఆరోగ్యాన్ని కూడా జాగ్రత్తగా ఉంచుకుంటూ పరీక్షల సమయంలో ఉపాధ్యాయుల సలహాల మేరకు విధి విధానాలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం ఉషారాణి, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భవనాసి రవితేజ, బత్తుల బ్రహ్మం, మేడం నాగేశ్వరావు, తిరివీధుల వెంకట నాగేశ్వరావు, కోశాధికారి బచ్చు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ పరిధిలో పన్నులు చెల్లించకుంటే ఆస్తుల జప్తు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

2024-2025 ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీతో ముగుస్తునందున్న నరసరావుపేట పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటి చార్జీల బకాయిలు చెల్లించాలని నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965 అనుసరించి బకాయిలు ఉన్న సంబంధిత యాజమానుల ఆస్తులు జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బకాయిపడి ఉన్న అసెస్మెంట్‌దారుల ఇళ్లకు గల అత్యవసర సర్వీసు అయిన కుళాయిలను డిష్, విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు. పట్టణంలో పన్నులు చెల్లించినవాల్సిన వారు పురపాలక సంఘ కార్యాలయ ట్రెజరీ నందు గానీ, వార్డు సచివాలయంలో లేదా www.cdma.ap.gov.in వెబ్సైట్ నందు చెల్లించాలని.. తద్వారా పురపాలక సంఘ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ప్రభుత్వ సెలవు దినాల్లోనూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను, వార్డు సచివాలయాల పరిధిలో మొబైల్ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. బకాయిలు ఉన్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, చెల్లింపులు చేయాలని కోరారు.

పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - మాచర్ల
ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మూడు కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారు. మాచర్ల శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధికంగా 450 మంది విద్యార్థులు, కృష్ణవేణి జూనియర్ కళాశాలలో 339, పల్నాడు జూనియర్ కళాశాలలో340 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. మొదటి రోజు పరీక్ష రాసేందుకు విద్యార్థులతోపాటు, వారి తల్లిదండ్రులు కూడా అధిక సంఖ్యలో పరీక్షా కేంద్రాలకు వచ్చారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుడా అన్ని వసతులూ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

అంగవైకల్యాన్ని అధిగమించి పరీక్ష రాయడానికి వచ్చిన శంకర్

కాల 'పరీక్ష'లను జయిస్తూ...

ప్రజాశక్తి - మాచర్ల
చిన్న పొరపాటు.. అతని జీవితాన్ని మార్చింది. ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నా.. అవిటితనం వెక్కిరించింది. అయినా, మొక్కవోని దీక్ష ఆ సమస్యలన్నింటినీ అధిగమించింది. ఆగిన విద్యను కొనసాగిస్తూ పలువురుకి స్ఫూర్తిగా నిలుస్తున్నాడా విద్యార్థి. మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బొమ్మపాళ్ల కొండలు, రమణ దంపతుల కుమారుడు భవానీశంకర్ నాలుగేళ్ల క్రితం జరిగిన అనుకోని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. 8వ తరగతి చదువుకున్న భవానీ శంకర్ ఆంజనేయ స్వామి మాల వేసుకొని ఇంటి మిద్దెపై నడుస్తున్న సమయంలో అతని ఒంటిపైనున్న కండువా గాలికి ఎగిరి పక్కనున్న కరెంటు తీగలపై పడింది. పొరపాటున శంకర్ ఆ కండువాను పట్టుకోవడం.. తడిగా ఉన్న దాని ద్వారా విద్యుత్ ప్రవాహం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణం నిలిచినా.. కుడిచేయి మడికట్టుపై వరకు, కుడి కాలు పాదం వేళ్లను శాశ్వతంగా కోల్పోయాడు. చిన్న పొరపాటు అతని జీవితాన్ని తలకిందులు చేసింది. గాయాలు నుంచి కోలుకోవడానికి కొన్ని నెలల సమయం పట్టింది. దైనందిన పనులు చేసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడేవాడు. కుమారుడు భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుట్టున్న ఆ తల్లిదండ్రులు.. శంకర్ పరిస్థితి చూసి లోలోపలే కుమిలిపోయారు. కుమారుడికి మద్దతుగా నిలిచి ప్రోత్సహించారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన భవిష్యత్తు ప్రయాణాన్ని మొక్కవోని దీక్షతో, దృఢ సంకల్పంతో తిరిగి ప్రారంభించాడు. చదువుపై మక్కువ ఉన్న శంకర్.. ఎడమ చేతితో రోజూ వారీ పనులు చేసుకోవడం, రాయడం ప్రారంభించాడు. ఆగిన చదువును కొనసాగించి పదవ తరగతి ఉత్తీర్ణుడై, మాచర్ల పట్టణంలోని పల్నాడు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. శనివారం ఇంటర్ మెదటి సంవత్సరం పరీక్ష రాయడానికి శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రానికి వచ్చాడు. ఎడమ కాలు నడవడానికి సహకరించకపోయినా.. తండ్రి సహాయంతో కేంద్రానికి వచ్చిన శంకర్‌ను పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో తీవ్ర ద్రోహం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్ వ్యవసాయ రంగానికి ఏ మాత్రం ఊతం ఇచ్చే విధంగా లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. మిర్చి రైతులు గిట్టుబాటు ధర లేక ఆందోళనలో ఉంటే వారికి భరోసా కల్పించే విధంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ధరల స్థిరీకరణ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం క్వింటా మిర్చి రూ.20 వేలు తగ్గకుండా కొనుగోలు చేసి రైతును ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు శనగ, కంది రైతులు కూడా సరైన ధర లేక దిగాలు పడ్డ పరిస్థితుల్లో వారికి ఏ మాత్రం స్వాంతన కలిగించే విధంగా ఈ బడ్జెట్ లేకపోవడం రైతులు, వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పేరిట ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు ఇస్తుందని చెప్పిన పాలకులు.. నేడు కేంద్రంతో కలిపి రూ.20 వేలు చెల్లిస్తామనడం రైతులను దగా చేయడమేనని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో 100 గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు సాగునీరు అందించే వరికపూడిశెల ప్రాజెక్టు శంకుస్థాపనలకే పరిమితమవుతుంది తప్ప.. బడ్జెట్లో నిధులకు మాత్రం నోచుకోవడం లేదని తెలిపారు.

దీన్నిబట్టి వెనుకబడిన ప్రాంతాలు, సాగునీటి ప్రాజెక్టుల పట్ల పాలకుల చిత్తశుద్ధిని తెలియజేస్తుందని పేర్కొన్నారు. రైతును రాజును చేస్తామనే ఊక దంపుడు ఉపన్యాసాలు మాని.. చేతల్లో రైతులకు భరోసా కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే రాబోయే కాలంలో రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-విజయపురిసౌత్
పీటీజీ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ జోబ్ అన్నారు. శనివారం పీటీజీ పాఠశాలలో ఫేర్‌వెల్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నాగార్జున సాగర్ పీటీజీ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో ఉన్నారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజయపురి సౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ సుబ్బారావు, వజ్రం నాయక్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, జనసేన అధ్యక్షుడు రాహుల్, ఎన్.బసివిరెడ్డి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఊరే మార్క్, కట్టారాజు, రామ్‌చంద్, మస్తాన్, గంటా ధనుంజయరావు, సీహెచ్ అప్పలరాజు, చరణ్, పండు, స్వామినాయక్, ఉపాధ్యాయులు ఉయ్యాల రోహిణి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లయోలా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మండలంలోని దూళిపాళ్ల లయోలా ఇంజనీరింగ్ కళాశాల 24వ వార్షిక వేడుకలు శుక్ర, శనివారాలలో కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయవాది కన్నా మోహర్ రజని మాట్లాడుతూ కళాశాలలో చేరిన విద్యార్థులు మంచి క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకుని, ఉత్తీర్ణత సాధించి పట్టా చేతిలో పట్టుకుని బయటకు వెళ్తే జీవితం సార్ధకత అవుతుందన్నారు. పట్టా లేకుండా బయటకు వెళ్లిన విద్యార్థుల జీవితం వ్యర్థమవుతుందని తెలిపారు. విద్యార్థులు అల్లరి చేయడమే కాదు.. క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకొని బయటకు వెళ్లాలని ఆమె సూచించారు. ఫాదర్ లూర్ద్ రెడ్డి మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవడం గొప్ప కళ అని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలని సూచించారు. 2024-2025 విద్యా సంవత్సరంలో అన్ని విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సత్కరించి, మెమొంటోలను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్ప విలాపం

- బంతిపూల సాగు రైతులకు నష్టాలే పలకరింపు
- పెట్టుబడులు కూడా రాని వైనం

ప్రజాశక్తి - తాడేపల్లి
ఈ ఏడాది బంతిపూలు సాగుచేసిన రైతులకు కాలం కలిసిరాలేదు. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. తమ కష్టార్జితానికి కూడా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. రాజధానిలో భూములన్నీ జంగిల్ కాంక్రీట్‌గా మారిన నేపథ్యం.. ముళ్లకంప, పనికి రాని మొక్కలు స్వాగతం పలికే రాజధానిలో అక్కడక్కడ రైతులు ఎర్రగరువు పొలంలో బంతిపూల సాగుకు ఉపక్రమించారు. దారి వెంట వచ్చి పోయేవారికి ఆహ్లాదకరంగా కనిపించే బంతిపూల పంట ఈసారి రైతుకు కన్నీరే మిగిల్చింది. ఎకరానికి పెట్టుబడి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. ఎకరా కౌలు రూ.20 వేలు ముందే చెల్లించాల్సి ఉంటుంది. కర్ణాటకలోని బెంగళూరు నుంచి సీడు రకం బంతిపూల మొక్కను ఒక్కొక్కటి రెండు రూపాయలు చొప్పున కొనుగోలు చేస్తామని తెలిపారు. ఎకరానికి రూ.14 వేల వరకూ ఖర్చు చేసి, బంతినారు కొనుగోలు చేయాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. విజయవాడ మార్కెట్ మీదే ఆధారపడి బంతిపూల వ్యాపారం నడుస్తోంది. ఈ ప్రాంతంలోని రైతులు తమ పండించిన వివిధ రకాల పూలను విజయవాడ మార్కెట్‌కు తరలిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో రైతులు దగ్గర రూ.10 నుంచి రూ.40 వరకూ కేజీ పూలను కొనుగోలు చేస్తున్నారు. అది కూడా ప్రస్తుతం పెళ్లిల సీజన్ కావడంతో ఆ మాత్రం ధర అయినా దక్కుతోంది. మార్కెట్లో దళారుల మాటే సాగుతోందని.. వారు చెప్పిన ధరకే ఇవ్వడం తప్ప, మాట్లాడే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎకరానికి 40 బస్తాల వరకూ పచ్చబంతి పూలు దిగుబడి వచ్చింది. మరో 20 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరలతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. తమ కష్టార్జితానికి తగ్గ ఫలితం కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాకిరీనే మిగిలింది..

ఈ సంవత్సరం పచ్చబంతి పూలు సాగుచేసిన రైతుకు తమ చాకిరీకి తగ్గ ఫలితం కనిపించలేదు. విజయవాడ మార్కెట్లో దళారుల రాజ్యం నడుస్తోంది. బంతిపూలు ధర నిర్ణయించే అధికారం రైతుకు లేదు. తెగుళ్ల నుంచి పంటను కాపాడుకొని, తీరా మార్కెట్‌కు వెళ్తే ఒక రోజు ఖాళీ చేతులతో రావాల్సి వస్తోంది. కూలీలకు డబ్బులు కూడా రాని పరిస్థితి ఉంది. ధరలు లేవు. మేమేమీ చేయలేమని వ్యాపారులు అంటున్నారు.

- మేక కృష్ణారెడ్డి, రైతు

తాతలకు నష్టపరిహారం ఇవ్వాలని మనవళ్ల దీక్షలు

కొనసాగిన ఏసీసీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి- తాడేపల్లి
తమకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారానికి 88వ రోజుకు చేరుకుంది. తమ తాతలకు ఏసీసీ యాజమాన్యం నష్టపరిహారం ఇవ్వాలని మనవరాళ్లు కూడా దీక్షలో కూర్చున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని నాటి కార్మికులతోపాటు.. వారి వారసులు కూడా పిడికిలెత్తి నినాదాలు చేశారు. దీక్షల్లో సిహెచ్ పిచ్చయ్య, ఎం.సుబ్బారావు, యెహోషువ, ఎస్.దేవరాజు, ఎం.ఆశీర్వాదం కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ గతంలో తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా పరిష్కారమయ్యే సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారమ్మ, వై.రమాదేవి, ఎస్.కె.ఇమాంబి, ఎన్.రిబ్కా, డి.నాగమల్లేశ్వరి, టి.దుర్గా భవాని, యు.రమణ, ఎం.శారద, డి.రమణ, ఇజ్రాయిల్, బి.దానయ్య, ఎస్.కె.ఖాసిం, డి.మాణిక్యరావు, ఎం.గురువయ్య, అగ్గయ్య, బి.అంకయ్య, వై.సులోచన, ఎస్కే భాషా తదితరులు పాల్గొన్నారు.

దీక్షల్లో కార్మికుల కుటుంబాలు

పంటను పరిశీలించి, రైతుల నుంచి సేకరించిన వివరాలు నమోదు చేసుకుంటున్న జపాన్ బృంద సభ్యులు

పసుపు పంటను పరిశీలించిన జపాన్ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో జపాన్ దేశానికి చెందిన పలువురు శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. శనివారం గ్రామంలోని పసుపు పంటలను బృంద సభ్యులు పరిశీలించారు. గ్రామానికి చెందిన అమ్మిశెట్టి శ్రీనివాసరావు అనే రైతు పొలంలో పసుపు పంట సాగు, దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాను ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నట్లు పసుపు రైతు అమ్మిశెట్టి శ్రీనివాసరావు జపాన్ శాస్త్రవేత్తల బృందం ప్రతినిధికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, బొడ్డు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
క్రీడాకారుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. క్రీడాకారుల భవిష్యత్తే లక్ష్యంగా సీఎం నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. కాకినాడకు చెందిన జాతీయ క్రీడాకారిణి ఎస్.కె.యాసిన్ ఎంటిఎంసీ పరిధిలోని కొలనుకొండలో శాప్ ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి యాసిన్ మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్ వేదికగా జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ జరిగిన 38వ జాతీయ క్రీడల్లో జిమ్నాస్టిక్స్‌లో భాగంగా ట్రామ్పోలిన్ వ్యక్తిగత విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు వివరించారు. జిమ్నాస్టిక్స్ విభాగంలో ఆమె సాధించిన పతకాలు, విజయాలను తెలియజేశారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ఉపయుక్తంగా ఉంటుందని కోరారు. పోటీల్లో పాల్గొనే క్రమంలో యూనివర్సిటీ అటెండెన్స్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందిని వివరించగా.. స్పందించిన శాప్ ఛైర్మన్ క్రీడాకారిణిని అభినందిస్తూ భవిష్యత్తులో అత్యుత్తమంగా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, శాప్ నుంచి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి
ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజున ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాగింది. తొలి రోజు కావడంతో విద్యార్థులు ఉదయం 7 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం కనిపించింది. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం విద్యార్థులను సంస్థ బస్సులలో తరలించగా, కొందరు విద్యార్థులను తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలపై పరీక్ష సెంటర్లకు చేర్చారు. పట్టణంలో స్టేషన్ రోడ్డులోని ఎన్నారై జూనియర్ కళాశాల, వైష్ణవి జూనియర్ కళాశాల, జేఎంజె మహిళా జూనియర్ కళాశాల, ఎల్వీఆర్ విశ్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాల, నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాల, జయప్రకాష్‌నగర్‌లోని శ్రీ చైతన్య, నారాయణ, లెక్చరర్స్ కాలనీలోని ఎన్నారై జూనియర్ కళాశాల, వివేక జూనియర్ కళాశాల, శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల, రామలింగేశ్వరపేట శ్రీ చైతన్య జూనియర్ కళాశాల మొత్తం 12 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల పరిధిలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంది.

మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

ఆచరణ సాధ్యంకాని అంకెల గారడీ బడ్జెట్

ప్రజాశక్తి-గుంటూరు
రాష్ట్ర అసెంబ్లీలో రూ.3.22 లక్షల కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్ రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి తోడ్పడేదిగా లేదని.. ఆచరణ సాధ్యం కాని అంకెల గారడీ బడ్జెట్ అని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. శనివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో రాష్ట్ర బడ్జెట్‌పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. అర్థశాస్త్ర అధ్యాపకులు సి.హెచ్.సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి-సంక్షేమం సమతూకం అనే పేరుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పరిశీలిస్తే సమతూకం అటుంచి వీటి మధ్య అంతులేని అంతరం ఉందన్నారు. రూ.80వేల కోట్లు ద్రవ్యలోటు పూడ్చుకునేందుకు ప్రజలపై అదనపు భారాలు మోపేవిధంగా బడ్జెట్ అంచనాలు ఉన్నాయన్నారు. బడ్జెట్‌కు దిశా నిర్దేశం లేదన్నారు. కూటమి పాలనలో ఏపీ చరిత్రలో రికార్డు స్థాయిలో అప్పులకు రంగం సిద్ధం చేసినట్లు బడ్జెట్ కనిపిస్తోందని తెలిపారు. రాజ్యాంగ చర్చావేదిక కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లోనైనా హామీలు అమలుకు నిధులు కేటాయిస్తారని ప్రజలు ఎంతో ఎదురు చూశారన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన ఏ అంశాన్నీ అమలు చేసే పరిస్థితి లేకపోవడంతో వాగ్దానాలను పూర్తిగా విస్మరించినట్లు అయ్యిందన్నారు. అప్పులు చేసి పప్పుకూడు తింటే గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏముందని ప్రశ్నించారు. గత ప్రభుత్వ బాటలోనే ఈ ప్రభుత్వం కూడా పయనిస్తుందని బడ్జెట్ చెప్పకనే చెబుతుందని అభిప్రాయ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యావేత్త ప్రసాదరావు, సీనియర్ సిటిజన్స్ నాయకులు ఎస్.కృష్ణారావు ప్రసంగించారు.

'బడుగుల జీవితాల్లో వెలుగులు నింపే బడ్జెట్'

ప్రజాశక్తి-మంగళగిరి
ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్ 2047 స్వర్ణాంధ్ర దార్శనికతను సాధించేందుకు పునాదులు వేసేలా, భవిష్యత్తులో పేదలు-బడుగుల జీవితాలలో వెలుగులు నింపేలా, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేలా ఉందని ఏపీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. కీలకమైన వ్యవసాయానికి రూ.48,340 కోట్లు, పాఠశాల విద్యకు రూ.31,806 కోట్లు, వైద్య రంగానికి రూ.18,260 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.18,848 కోట్లు, జల వనరుల అభివృద్ధికి రూ.18,020 కోట్లు.. ఇలా ప్రతి రంగానికీ బడ్జెట్లో సముచిత కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో పడకేసిన రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మళ్లీ గాడిలో పెట్టి, రాజధాని-పోలవరం ప్రాజెక్టులను పట్టా లెక్కించి, అన్ని రంగాలూ మళ్లీ బలం పుంజుకునేలా, బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల ఆశలు.. ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని తెలిపారు. పెన్షన్లను రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, దీపం పథకం ద్వారా అర్హులకు మూడు ఉచిత సిలిండర్లు, 204 అన్న క్యాంటీన్లతో ప్రజలు ఎంతగానో సంతోషిస్తున్నారని పేర్కొన్నారు. బీసీల సంక్షేమానికి గతంలో కంటే మిన్నగానే బడ్జెట్లో రూ.47,456 కోట్లు కేటాయించినప్పటికీ.. వారి జనాభా దామాషాతో పోల్చితే చాలా తక్కువని, ఈసారి రూ.60 వేల కోట్లన్నా ప్రతిపాదిస్తారని ఆశించామని పేర్కొన్నారు. వృత్తిదారులకు ఆధునిక పనిముట్లు అందించే 'ఆదరణ' పథకానికి ప్రకటించిన రూ.వెయ్యి కోట్లకు అదనంగా మరో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరల కోసం కదం తొక్కుతున్న రైతాంగానికి కనీసం ఊరట కలిగించేలా, రూ.3 వేల కోట్లతో ఎం.ఎస్.పి స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసేలా తమ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించాలని కోరారు.

మాజీ వీసీతో విద్యార్థులు

వర్సిటీని సందర్శించిన మాజీ వీసి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని మాజీ వీసి ఆచార్య ఎ. రాజేంద్రప్రసాద్ శనివారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఇన్చార్జి వీసి ఆచార్య కె. గంగాధర రావు, ఇన్చార్జి రిజిస్ట్రార్ జి. సింహాచలం, ఆచార్య ఎమ్. త్రిమూర్తి రావు, ఆచార్య జి. చెన్నారెడ్డి, ఆచార్య పి. బ్రహ్మాజీరావు, సి ఇ. శివప్రసాదరావు, రెడ్డి ప్రకాష్, ఏఈ.కష్ణ తదితరులు ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంలో ఆయనను ఇంచార్జి వీసి గంగాధర రావు సన్మానించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

పాఠశాల దశలోనే గ్లోబల్ వార్మింగ్ పై కె.నిహిర వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి ఏఎన్‌యు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అంటూ గ్లోబల్ వార్మింగ్ పై అవగాహన కలిగేలా వివా పాఠశాల విద్యార్థిని కె.నిహిర చేసిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటోంది.జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని వివా స్కూల్ లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణ పై మంచి సందేశాన్ని సమాజానికి అందించడంతో ఎంతోమందిని ఆలోచింపచేస్తోంది.

సిపిఐ నాయకురాలు సువార్తమ్మ మృతి

ప్రజాశక్తి తెనాలి

స్థానిక ఐతానగర్ కు చెందిన సిపిఐ నాయకురాలు వేము సువార్తమ్మ(100) శనివారం మృతి చెందింది. ఆమె తన భర్త రామ సుబ్బయ్యతో కలిసి పార్టీలో సుదీర్ఘకాలం పని చేశా రు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఇరువురు కుమారులు ఉన్నారు. తెనాలి తాలూకా మహిళా సమాఖ్యలో పనిచేసిన ఆమె ప్రజానాట్యమండలిలో కూడా పని చేశారు. బెంగాల్ కరువు బుర్రకథ పై అనేక గ్రామాల్లో ప్రదర్శనలిచ్చారు. ఆమె మతికి సిపిఐ నాయకులు బొల్లి ముంత కృష్ణ, కనపర్తి బనహర్, చెరుకుమల్లి సింగారావు తదితరులు నివాళులర్పించారు. పార్టీ అగ్ర నాయకులు కూడా సంతాపం ప్రకటించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రకృతి సేద్యంతో ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ

పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే .అమల కుమారి

ప్రజాశక్తి పెదకూరపాడు

ప్రకతి వ్యవసాయ విధానంలో మిరప పంటలను సాగు చేస్తూ ప్రధాన పంటతో పాటు అంతర పంటలు వేయటం వలన రైతులు అధిక ఆదాయం పొందుతారని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే. అమలకుమారి అన్నారు. శనివారం పెద్దకూరపాడు మండలం లింగం గుంట, పెదకూరపాడు గ్రామంలో మిరపపంట పొలాలను పరిశీలించారు. గ్రామాల్లోని ప్రకతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం చేసే రైతులతో మాట్లాడారు. రైతులు ప్రకతి వ్యవసాయ విధానంలో పండిస్తున్నటువంటి పద్ధతులను రైతుల ఆదాయ ఖర్చులను అడిగి తెలుసు కున్నారు. మిరప పంట వేసే రైతు ముందుగా 31 రకాల విత్తనాలను బీజామతం విత్తన శుద్ధి చేసి పొలంలో చల్లి 45 రోజుల తర్వాత కలయ దున్నటం వలన భూములు జీవవైవిధ్యం పెరిగి ప్రధాన పంటకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు అభివద్ధి చెంది అంతా ఆరోగ్యంగా ఉంటుందని రైతులు తెలియపరిచారు. ప్రకృతి వ్యవసాయంలో సాగవు తున్న మిరప మొక్కలలో వ్యాధి నిరోధక శక్తి 20 నుంచి23 వరకు రావడం గమనించారు. రసాయన వ్యవసాయంలో సాగుతున్న మిరప మొక్కలలో వ్యాధి నిరోధక శక్తి 14 నుంచి16 వరకు రావడం జరిగింది అని తెలియజేయడం జరిగింది. మిరప పొలాల్లో అంతర పంటలు వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని మరియు మిరపకు ఆశించే నల్ల తామర బెడద తట్టుకోవచ్చని తెలియజేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ ప్రకతి వ్యవసాయం పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ అభ్యుదయ రైతు దర్శి శేషారావు మాట్లాడుతూ తన పొలంలో వరుసగా నాలుగు సంవత్సరాలు పీఎండీఎస్ వేయడం వలన, భూమిలో జీవవైవిధ్యం పెరిగి సేంద్రీకరణ శాతం కూడా పెరుగుతుందని అదేవిధంగా ప్రధాన పంటలో రసాయన ఎరువులు వినియోగం తగ్గటం కలుపు నివారణ కూడా తగ్గుతుందని ప్రధాని పంటలో చెడ్డ పేడలు తెగుళ్ల తట్టుకునే సామర్థ్యం కూడా ఉంటుందని ప్రధాన పంటలు దిగులు కూడా పెరుగుతాయి అని తెలియపరిచారు. పంట చుట్టూ కాపుగా జొన్న సజ్జ వేయడం వల్ల పంట ను పురుగులు తెగులు నుండి రక్షణ కల్పించే విధంగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి అమూల్య, ప్రకతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

పంటను పరిశీలిస్తున్న అధికారులు

రంగస్థల విభాగం ఆధ్వర్యంలో కమిటీ చిల్డ్రన్ థియేటర్ కార్యక్రమం

ప్రజాశక్తి ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగంలోని థియేటర్ ఆర్ట్స్ విద్యార్థుల పాఠ్యాంశాల్లో భాగంగా లికమిటీ చిల్డ్రన్ థియేటర్‌లి అనే అంశం పై శనివారం ప్రదర్శన నిర్వహించారు. తెనాలి మండలం కటేవరం గ్రామంలో లికమ్యూనిటీ థియేటర్, చిల్డ్రన్ థియేటర్‌లి అనే అంశం మీద ఒకరోజు శిక్షణ శిబిరం, ఇంటరాక్షన్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ 8, 9 తరగతుల విద్యార్థులతో దాదాపు 8 గంటలపాటు నిర్విరామంగా శిక్షణ, ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనే ముఖ్యాంశం మీద ఏడు నాటికలు తయారుచేసి ప్రజెంట్ చేశారు. గ్రామంలోని పల్లెలో దాదాపు 30 మంది స్త్రీలు కమిటీ థియేటర్ వర్క్ షాప్ నందు పాల్గొని వారి సమస్యలు వారి ముందే వారే పాల్గొని నటించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో మాస్ట్రో పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విద్యార్థులు, స్థానికంగా ఉండేటువంటి ఏ ఐ ఆర్ టిడిఎస్ స్వచ్ఛంద సంస్థ సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో అటు విద్యార్థిలు ఇటు మహిళలు పూర్తిస్థాయి లో పాల్గొని వారి అనుభవాలను, అనుభూతులను సమస్యలను చర్చించి ప్రదర్శన రూపొందించడం అనేది వినూత్న ప్రక్రియగా భావించి ఆనందించారు. ఈ కార్యక్రమన్ని రంగస్థలం కళల శాఖ అధిపతి ఆచార్య ఎల్.వి నాగభూషణరావు పర్యవేక్షణ చేశారు.

తండావాసులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు,

అనుమానిత ప్రదేశాలలో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బొల్లాపల్లి మండలంలో అనుమానిత ప్రదేశాలలో నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు ఎక్సైజ్ అడాప్షన్ అధికారి కె శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తండావాసులతో మాట్లాడుతూ సారాయి తయారు చేయడం, రవాణా చేయడం, కలిగి ఉండటం, సారాయి విక్రయించడం చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని సూచించారు.

కొత్త ట్రాఫిక్ చట్టాలు అమలు : ఎస్ఐ

ప్రజాశక్తి - క్రోసూరు

కొత్త వాహన చట్టం ప్రకారం శనివారం నుంచి ట్రాఫిక్ చట్టాలు అమలులోకి వస్తాయని క్రోసూరు మండల ఎస్ఐ నాగేంద్రరరావు తెలిపారు. వాహన దారులు తప్పనిసరిగా లైసెన్సు, బీమా, హెల్మెట్ కలిగి ఉండాలని, అలా లేకుంటే అధిక వసూలు చేయబడతాయని చెప్పారు. అనగా రూ.150 స్థానంలో రూ.500 జరి మానా ఉంటుందన్నారు. అదే విధంగా డ్రంక్ డ్రైవ్, మైనర్లు వాహనాలు నడిపితే మరింత కఠిన చర్యలు, జరిమానాలుంటాయని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ రూల్స్ను అతిక్రమించరాదని కోరారు. ఆంధ్రప్రదేశ్ లో వాహనాల చట్టం జరిమానాలు..మార్చి 1-2025 నుండి మోటారు వాహనాల చట్టం అమలు కొన్ని ఉల్లంఘనలు జరిమానాలు (రూ.లలో) శిరస్త్రాణం (హెల్మెట్) లేకపోతే 1000లు , వెనుక కూర్చున వ్యక్తికి శిరస్త్రాణం లేకపోతే 1000, నోడ్రైవింగ్ లైసెన్స్ 10,000లు, వాహనానికి భీమా లేకపోతే 1000లు, రెండోసారి పట్టుబడితే 2000లు,శబ్ద, పొగ కాలుష్యం చేస్తే 2000-4000లు, డేంజరస్ పార్కింగ్ 1,500-3000లు, రేసింగ్ (ఓవర్ స్పీడ్) 5000లు, డేంజరస్ డ్రైవింగ్ 10,000లు, మైనర్ డ్రైవింగ్ 1000లు, ప్రయాణికులను రవాణా వాహనాలలో ఎక్కిస్తే మనిషికి రూ. 200లుచొప్పున జరిమానాలు విధిస్తామని తెలిపారు.

అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అరవింద హైస్కూల్లో అకడమిక్ డెమో

చార్టుల ద్వారా వివరిస్తున్న ఉపాధ్యాయురాలు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

సంవత్సరమంతా విద్యార్థులు ఏమి నేర్చుకున్నారో, తల్లిదండ్రులకు తెలియజేయడానికి అకడమిక్ డెమో కార్యక్రమం ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి అర వింద హైస్కూల్లో శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అకాడమిక్ డెమో కార్యక్రమాన్ని సందర్శిం చారు. ప్రీప్రై మరీ, ప్రైమరీ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబం ధించిన కత్యాలను పజిల్స్, చార్టులు, ఆటలు రూపంలో అరవింద స్కూల్ ఉపాధ్యాయులు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి వచ్చి అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఆక్టివిటీస్‌ను ఎంతో ఉత్సా హంగా చేశారు. సంవత్సరానికి ఒకసారి ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వలన వారి పిల్లల విద్యాభివృద్ధి ఏ స్థాయిలో ఉందో, వారు ఇంటి వద్ద వారి పిల్లలకు ఎటువంటి సహాయం చేయాలో తల్లిదండ్రులకు అర్థమవుతుందని ప్రధాన ఉపాధ్యాయు రాలు అనురాధ అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సెకండరీ తరగతుల విద్యార్థులకు నెలసరి గురించి, తీసుకోవా ల్సిన పౌష్టికాహారం గురించి, ఈ వయస్సులో వారి శరీరంలో వచ్చే మార్పుల గురించి వివరంగా తెలి పారు. అతిధులకు పిల్లలు చిత్రీకరించిన ఉడ్ పెయింటింగ్స్‌ని బహుకరించారు. కార్యక్రమంలో అర వింద హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదం డ్రులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ విజయం మాదిగ అమరవీరులకు అంకితం

ప్రజాశక్తి చేబ్రోలు

ఎంఆర్పిఎస్ నాయకులు కార్యకర్తలు చేబ్రోలు ప్రధాన రహదారి డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహం దగ్గర శనివారం మాదిగ అమరవీరులకు జోహార్లు కార్యక్రమాన్ని (దండోరా) నిర్వహించారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు మురికిపూడి హదయ రాజు మాదిగ మాట్లాడుతూ ఎంఆర్పిఎస్ సాధించిన విజయాన్ని వారికి అంకితం చేస్తూ గ్రామ గ్రామాన వాడవాడనా వారిని స్మరించుకోవడం అందరి బాధ్యతగా వారి ఆశయాలను కొనసాగింపులో భాగంగా అందరం ముందుకు సాగవలసిన బాధ్యత ఉందని అన్నారు. జాతి ఉద్యమంలో నిరంతరం పాల్గొని అసువులు బాసిన అమరవీరుల ఆశయాలను కొనసాగించటంతో పాటు మాదిగల ప్రతి విజయం వారికి అంకితం అని అన్నారు . వర్గీకరణ సాధనలో కుటుంబాలను పణంగా పెట్టి ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులకు జోహార్లు , ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు . కార్యక్రమంలో డేగల బాబు మాదిగ గురవయ్య మాదిగమాదిగ కె ఆదాము మాదిగ ఎమ్మార్పీఎస్ ఎంఈఎఫ్ ఎంఎస్పి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కను అందజేస్తున్న విజయలక్ష్మి

అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి, పెదనందిపాడు:
మండలంలోని సెక్టార్ 1, సెక్టార్ 2 అంగన్వాడీ కేంద్రాలను శనివారం స్పెషల్ ఆఫీసర్ కెవిఎస్ విజయలక్ష్మి పరిశీలించారు. కేంద్రాలలోని ప్రీస్కూల్ రిజిస్టర్లు, మెనూ, పోషణ వాటిక, రైస్ వాటర్ హార్వెస్టింగ్, ఫుడ్ స్టాక్ నిల్వలను తనిఖీ చేశారు. పోషణ వాటికలోని ఆకుకూరలు నిరంతరం కొనసాగించాలని, పురుగుమందులు వాడకుండా సహజ ఎరువులతో పండించి, తల్లులకు అవగాహన కల్పించి వారు కూడా ఇంటిలో పెరటి తోటలు పెంచుకునేలా ప్రోత్సహించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ముందుగా మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆడ పిల్లలు పుట్టిన తల్లిదండ్రులకు పండ్ల మొక్కను అందించి, మొక్కను ఎలాగైతే జాగ్రత్తగా పెంచుతామో, ఆడపిల్లలను కూడా జాగ్రత్తగా చూసుకోవాలని, వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో గుంటి లక్ష్మీదేవి, ప్రత్తిపాడు సిడిపిఓ వి సుజాత దేవి, ఏసిడిపిఓ సిహెచ్ విజయలక్ష్మి, సెక్టార్ సూపర్వైజర్ వై రాజ్యలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ఐదు సెంటర్లలో ఇంటర్మీడియట్ పరీక్షలు

ప్రజాశక్తి మంగళగిరి
మంగళగిరి పట్టణంలో ఐదు సెంటర్లలో శనివారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వీజే జూనియర్ కళాశాల, నిర్మలా జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల, సీకే జూనియర్ కళాశాలలోని సెంటర్లో ఇంటర్మీ డియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు జరిగాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అనుకున్న సమయానికి ముందే హాల్ టికెట్లతో హాజరయ్యారు.

విద్యార్థులకు బేసిక్స్ నేర్పిస్తున్న ట్రైనర్ కార్తీక్

ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి దుగ్గిరాల
విద్యార్థులకు కంప్యూటర్ నిర్వహణలో బేసిక్ నేర్పించనున్నట్లు ఇన్ఫోసిస్ కంపెనీకి చెందిన రోబోటిక్ ట్రైనర్ కార్తీక్ తెలిపారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో శనివారం బాలురకు శిక్షణను ఇచ్చారు. ప్రతి బాలునికి ఒక ట్యాబ్ ఇచ్చి దానిపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో 5500 పైగా కోర్సులు ఉన్నాయని అవి పూర్తిగా ఉచితం అన్నారు. కోర్సు లు నేర్చుకున్న అనంతరం ఈ-సర్టిఫికెట్ ఇస్తారని తెలి పారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా కంప్యూటర్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కంప్యూ టర్లతో కూడిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో బేసిక్ నేర్చు కున్న అనంతరం అడ్వాన్స్‌కు వెళ్లవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ సిబ్బంది త్రివేణి ఫైసల్ వంశీ సంతోష్ మండల విద్యాధికారి కె లక్ష్మీనారాయణ పాఠశాల అధ్యాపక బందం పాల్గొన్నారు అంతకుముందు మండల విద్యాధికారి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

“ఆధునిక భారతంలో యువత పాత్ర కీలకం”

ఘనంగా ముగిసిన అంతరాష్ట్రీయ యువ సమ్మేళనం

ప్రజాశక్తి ఏఎన్‌యు
ఆధునిక భారతంలో యువత పాత్ర కీలకం అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే గంగాధరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నందు భారత ప్రభుత్వము, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర, గుంటూరు ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 5 రోజుల పాటు జరిగిన అంతరాష్ట్రీయ యువ సమ్మేళనం కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ భవన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో ఒడిశాలోని 5 జిల్లాలైన మయూర్భంజ్, ఫుల్బాని, కందమాల్, గంజాం నబరంగపూర్ జిల్లాల నుంచి మొత్తం 26 మంది యువతి యువకులు హాజరైయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే గంగాధరావు మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు మరియు అభ్యాసాల పరిజ్ఞానం రాష్ట్రాల మధ్య మెరుగైన అవగాహన పెరగటానికి సహాయపడుతుంది అని అన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ కార్యశాలలు, క్షేత్ర స్థాయి సందర్శనల ద్వారా ఒడిశా యువతకు యువతకు ఇక్కడ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లుతో సహా, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి యువ సమ్మేళనంలో తెలియజేసే అవకాశం దొరికింది అని అన్నారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి సహకరించిన ప్రతి డిపార్ట్మెంట్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగ వాలంటీర్లకు ధన్య వాదములు తెలియజేసారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ దివ్యతేజో మూర్తి, కోఆర్డినేటర్, ఎన్ ఎస్ ఎస్, అతిధులుగా హాజరై ప్రసంసింగించగా సాంస్కృతిక నత్య ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా జరిగింది. ఒడిశా నుంచి హాజరైన ప్రతి ఒక్కరికి పార్టిసిపంట్ సర్టిఫికెట్స్ అందజేశారు.

యువ సమ్మేళనంలో అతిథులు

ప్రభుత్వ పాఠశాలలను బ్రతికించుకోవాలి

ప్రజాశక్తి దుగ్గిరాల
ప్రభుత్వ, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయటం ద్వారానే విద్యారంగాన్ని కాపాడుకోవచ్చని రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు కే.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలో శనివారం యుటిఎఫ్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 117 పేరుతో పాఠశాలల వ్యవస్థ విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. జీఓ నెంబర్ 117 ను రద్దు చేస్తామంటూనే మోడల్ ప్రైమరీ పాఠశాలను తీసుకు వచ్చిందన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలను స్వాగతిస్తున్నామనీ, మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతి విద్యార్థుల్ని తరలించడానికి వ్యతిరేకిస్తున్నామన్నారు. మైనర్ మీడియం పాఠశాలను యధాతథంగా కొనసాగించాలని కోరారు. 50 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చాలని మిగిలిన ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా కొనసాగించాలన్నారు. సాల్ట్ పథకం ద్వారా ఇస్తున్న శిక్షణ పని దినాల్లో కాకుండా సెలవుదినాల్లో మాత్రమే నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకి పరిమితం చేయాలనీ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించే ప్రక్రియ ఉపాధ్యాయులు చేపట్టాలని కోరారు. ఉర్దూ మీడియం పాఠశాలలకి రంజాన్ సందర్భంగా హాఫ్ డే స్కూల్ జీవో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూట్యూబ్ జిల్లా కోశాధికారి గయాసుద్దవుల కే కామాక్షి చలపతిరావు సతీష్ ప్రభాకర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలు - సంపద సృష్టే లక్ష్యం

చెత్తసేకరణ, వానపాములు, ఎరువును పరిశీలిస్తున్న అధికారి

ప్రజాశక్తి చేబ్రోలు
స్వచ్ఛ గ్రామాల సాధనే లక్ష్యంగా, చెత్త నుండి సంపద సృష్టి ప్రధాన అంశంగా స్వర్ణాధ్ర - స్వచ్ఛాంధ్ర కార్య క్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని డిపిఆర్‌సి నిరంజన్ తెలిపారు. శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేజెండ్ల, సుద్దపల్లి, శలపాడు, వి.ఎన్ పాలెం, శేకూరు, వడ్లమూడి (గౌడపాలెం) గ్రామాల్లో డోర్ టు డోర్ చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి మూడు బిన్నుల ద్వారా తడి, పొడి, హానికరమైన చెత్తలను వేరువేరుగా సేకరించే విధానాన్ని పరిశీలించారు. చెత్త సేకరించే విషయంలో క్లాప్ మిత్రాలు, పంచాయతీ సిబ్బంది పాటించవలసిన విధానం గురించి ఆయన సిబ్బందికి వివరించి పలుసూచనలు చేశారు. గ్రామ ప్రజలకు మరింతగా అవగాహన కల్పించేందుకు, సిబ్బంది ప్రధాన వీధుల్లో తిరిగి చెత్తను మూడు రకాలుగా వేరుచేసి మూడు చెత్త డబ్బాల ద్వారా కాని, బిన్ బ్యాగ్ విధానం ద్వారా వేరుచేసి పంచాయితీ సిబ్బందికి అందించాలని సందర్భంగా ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంద్ర కార్యక్రమం ద్వారా గ్రామాన్ని స్వచ్ఛ వేజెండ్లగా మార్చేందుకు ప్రజలు పంచాయతీ సిబ్బంది, క్లాప్ మిత్రాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.అనంతరం ఆ గ్రాలలోని ఘన వ్యర్థాల నుండి సంపద సష్టి కేంద్రం ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డులను సందర్శించి, వానపాముల ఎరువు తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శరణు వేణు గోపాల రావు, జి సుభాష్ చంద్రబోస్, బి ప్రశాంతి, శ్రీలత, జి శ్రీనివాసరావు, డి సుజన, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

కంది పంటపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి చేబ్రోలు
శనివారం నారాకోడూరు రైతులతో రైతు సేవ కేంద్రంలో కంది పంటపై చర్చ కార్యక్రమం నిర్వహించడం నిర్వహించినట్లు ఉద్యానశాఖ అధికారి ఉష తెలిపారు. కార్యక్రమంలో లాం, ఫాం ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్. ఎన్.వెంకటలక్ష్మి పాల్గొన్నారని, రైతులతో కంది పంట గురించి చర్చించారు. అనంతరం పొలాలకు వెళ్లి కంది పంటలను పరిశీలించారు. పంట కోత అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించి, అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువుల యాజమాన్యం, పంట మార్పిడి విధానాలు వాటి ఆవశ్యకత, గురించి రైతులతో చర్చించి రైతులకు పలు సలహాలు సూచనలు చేప్పారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు జి శివసత్యం బాబు గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతులతో చర్చిస్తున్న అధికారి ఉష

పెన్షన్ పంపిణీలో పాల్గొన్న డిఎల్‌పిఓ స్వరూప రాణి

ఇళ్లను పరిశుభ్రంగా ఉంచండి

ప్రజాశక్తి దుగ్గిరాల
ఇళ్లను పరిశుభ్రంగా ఉంచటం ద్వారా జబ్బుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చునని డిఎల్‌పిఓ స్వరూప రాణి అన్నారు. శనివారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా ఆమె మండల కేంద్రం దుగ్గిరాలలో క్లాస్ మిత్రులతో కలిసి ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్త సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్యం బారిన పడకుండా చర్యలు తీసుకు వచ్చిందని గ్రామాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి జవహర్లాల్ నెహ్రూ గ్రామ కార్యదర్శి వివేకానంద స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వర్గీకరణ కోసం అమరులైన వారికి నివాళి

ప్రజాశక్తి మంగళగిరి
ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులకు శనివారం కొత్త బస్టాండ్ సెంటర్లోని జగజ్జీవన్ రావ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో అమ రుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కే.నాగేశ్వరావు మాట్లా డుతూ 2008 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ముట్టడిలో పలువురు ప్రాణ త్యాగం చేయడం వల్లనే ఎస్సీ వర్గీకరణ జరిగిం దన్నారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధి కార ప్రతినిధి సిహెచ్ విక్టర్‌పాల్, ఎంఎస్‌పి నాయకులు వై.శ్యామల, వి.కుమార్, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి ప్రత్తిపాడు:
ప్రత్తిపాడు నియోజకవర్గం లోని యనమదల గ్రామంలో ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎం.ఆర్.పి.ఎస్ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ కై వీర మరణం పొందిన మాదిగ అమరవీరులకు పాలేపుశివయ్య మాదిగ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ముఖ్య అతిధులుగా హాజరైన ఎమ్మార్పీఎస్ ప్రత్తిపాడు నియోజకవర్గం కన్వీనర్ తోడేటి యేసుపాదం మాదిగ మాట్లాడుతూ.ఎస్ సి వర్గీకరణ సాధనకై యుద్ధం చేస్తూ అమరత్వం పొందిన వాళ్ళు ఎందరో పోరాట వీరులు ఉద్యమిస్తూ అనారోగ్య కారణాల రీత్యా అసువులు బాశారు. వారందరికీ నివాళులు ఆర్పిస్తున్నాం. 30 ఏండ్లు, ఒక తరం ఈఉద్యమంలో భాగమై మంద కష్ణ మాదిగ పిలుపు మేరకు శ్రమించారు. వారందరికీ ఉద్యమ జేజేలు పలుకుతూ జోహార్లు అర్పించారు ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు తోడేటి కపారావు మాదిగ, తోడేటి ప్రభుదాస్ మాదిగ, గొడ్డుగోరు చిన్నబ్బాయి మాదిగ, తోడేటి జగదీష్ మాదిగ, తోడేటి బుల్లి మాదిగ, మన్నవ సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సిఎస్ఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ గాదె వీరభద్రాచారికి తమ యూనివర్సిటీ ఈఈఈ విభాగంలో పిహెచ్‌డి పట్టా అందచేసిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. వీరభద్రాచారి ' డెవలప్‌మెంట్ ఆఫ్ లీస్ట్ స్క్వేర్స్ రెగ్రిషన్ బేస్డ్ ఏఎల్ఓ టెక్నిక్ ఫర్ ద బెస్ట్ ఆప్టిమల్ సొల్యూషన్ ఆఫ్ ఓఆర్‌పిడి అండ్ ఎల్ఈడి ప్రాబ్లమ్స్ ఇన్ పవర్ సిస్టమ్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈయనకు వర్సిటీలోని ఈఈఈ విభాగం ప్రొఫెసర్ మెర్సీ రోసలీనా గైడ్‌గా వ్యహరించారన్నారు. ఈ సందర్భంగా గాదె వీరభద్రాచారిని వీసీ, వివిధ విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

నేడు పెనుగొండ లక్ష్మీనారాయణకు సత్కారం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా గర్వించదగ్గ ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు, కేంద్ర ప్రభుత్వం పెనుగొండ లక్ష్మీనారాయణకు సమున్నత 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు' ప్రకటించిన సందర్భంగా నేడు స్థానిక ఇన్నర్ రింగ్‌రోడ్డు, వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఉన్న తనుబుద్ధి బసవిరెడ్డి నగర్ శ్రీరామధామం సమావేశ మందిరంలో సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ పార్లమెంట్ సభ్యులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా మువ్వా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఎంవీ రామిరెడ్డి వ్యవహరిస్తారని, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్, అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జిఎస్ చలం ప్రముఖ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, ప్రొఫెసర్ సిహెచ్ సుశీలమ్మ, అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ పాల్గొంటారని, నగరంలోని రచయితలు, సాహితివేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించి పాఠశాల విద్యార్థులు

ఆర్‌విఆర్ అండ్ జెసిలో శాస్త్ర విజ్ఞానంపై సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు శాస్త్ర విజ్ఞానం అధ్యయనానికి అంకురార్పణ జరగాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గత రెండ్రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ముగింపు సందర్భంగా కళాశాల పరిసర ప్రాంతాల నుండి వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కళాశాలలోని ఇంక్యూబేషన్ సెంటర్‌ను సందర్శించారు. విద్యార్థులకు సైన్స్ క్విజ్‌లు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి మెమోంటోలు అందజేశారు. భారతీయ శాస్త్ర ప్రతిభను ప్రపంచానికి చాటి, నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయ శాస్త్రవేత్తగా సర్ సివి రామన్ చరిత్ర సృష్టించారని కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపద సృష్టికర్తలుగా విద్యార్థులు ఎదగాలి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న శివారెడ్డి

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో శనివారం మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ఎసోటెరిక్-2025' అంతర కళాశాలల మేనేజ్మెంట్ అండ్ కామర్స్ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోకో కోలా బెవరేజ్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజర్ యు.శివారెడ్డి పాల్గొని మాట్లాడుతూ మేనేజ్మెంట్, కామర్స్ విద్యార్థులు సంపద సృష్టికర్తలని, ఆలోచనలే పెట్టుబడిగా పెట్టి , అవకాశాలు అందిపుచ్చుకొని లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా మంచి విషయమని అన్నారు. కళాశాల సెక్రటరీ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ మనం ఎప్పుడూ మన చుట్టూ ఉన్న వారికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని, సమాజంలో చాలా అవకాశాలు ఉన్నాయని, వాటిని గుర్తించి ఆరంగాలలో రాణించాలని చెప్పారు. వివిధ కళాశాలల నుండి విచ్చేసిన విద్యార్థులకు క్విజ్, స్టాక్ మార్కెటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలలో ఆర్‌విఆర్ జెసి విద్యార్థులు ప్రధమ స్థానం, టిజెపిఎస్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, కన్వీనర్ డాక్టర్ బి.వి.హెచ్.కామేశ్వరశాస్త్రి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ నాగనిర్మల, డాక్టర్ యు.రవికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి అరాచకాల పై అధికారుల ప్రేక్షక పాత్ర!

వీక్షణం

శాసన మండలి ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి గత నెల 27వ తేదీన జరిగిన పోలింగ్ లో టిడిపి నాయకుల చేసిన అరాచకాలపై అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషించింది. సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ జరుగుతుందని చూసిన యంత్రాంగం ఏ మాత్రం పట్టించు కోలేదు.

అధికార యంత్రాంగం పూర్తి నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. క్షేత్రస్థాయి అధికారులంతా అరాచకాలను ఏమాత్రం పట్టించుకోకుండా దొంగ ఓట్లు , రిగ్గింగుకి అనుమతించారు. ప్రధానంగా పల్నాడు జిల్లాలోని మాచర్ల, వినుకొండ, పెదకూరపాడు, చిలకలూరిపేట, గురజాల నియోజక వర్గాలలో ప్రజాప్రతినిధుల అనుచరులు పోలింగ్ కేంద్రాల్లో వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని పి. డి. ఎఫ్. అభ్యర్థి, సిట్టింగ్ ఎం. ఎల్.సి. కె.ఎస్.లక్ష్మణ రావు వ్యాఖ్యానించారు. దొంగ ఓట్లను, రిగ్గింగ్ అడ్డుకోవాల్సిన యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరించినా ఉన్నతాధికారులు, ఎన్నికల కమిషన్ ప్రతినిధులు కూడా పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా యెటువంటి గుర్తింపు కార్డు లేకున్నా ఓటు వేయడానికి అనుమతించారు. అలాగే టిడిపి, జనసేన నేతల అక్రమాలను ప్రశ్నించిన పి.డి.ఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు ఏజెంట్లను బయటకు పంపారు. కొన్నిచోట్ల పి.డి.ఎఫ్ ఏజెంట్ల పై దాడికి పాల్పడ్డారు. గుంటూరు జిల్లా లోని మంగళగిరి, తాడికొండ, గుంటూరు పశ్చిమ, పత్తిపాడు తదితర నియోజక వర్గాలలో కూడా యధేచ్ఛగా దొంగ ఓట్లు వేయించారు. ఎక్కడా అధికార యంత్రాంగం అడ్డుకున్న దాఖలాలు లేవు. దుగ్గిరాలలో పి.డి.ఎఫ్. ఏజెంట్లను బలవంతంగా బయటికి పంపారు. ఏక పక్షంగా పోలింగ్ జరుగుతుందని వెబ్ కాస్టింగ్ లో చూసినా చర్యలు లేవు. దుగ్గిరాల లో ఇద్దరు ఏజెంట్ల ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తెనాలి, కొల్లిపరలో కూడా ఎన్నికలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి టిడిపి నాయకులు ఒక ప్రణాళిక ప్రకారం వ్యవహరించారు. బాపట్లలో పి.డి.ఎఫ్. అభ్యర్థి కి చెందిన ఏజెంట్లు, ఇతర ప్రజాసంఘాల నాయకులపై టిడిపి నేతలు దాడికి పాల్పడ్డారు. నిభందనలకి విరుద్ధంగా పలువురు ఎమ్మెల్యేలు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి యదేచ్ఛగా రిగ్గింగ్ ,దొంగ ఓట్లు వేసేలా తమ అనుచరులను ప్రోత్సహించారనే విమర్శలు ప్రభలంగా వినిపించాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో కూడా ఇదే రీతిలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి జనసేన నాయకులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపించాయి. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటి వైసిపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని గగ్గోలు పెట్టిన టిడిపి నాయకులు ఇప్పుడు అంతకంటే ఎక్కువగానే నేరుగా రిగ్గింగ్ చేయడం, పట్టభద్రులు కాని వారి చేత ఓటు వేయించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని వామ పక్షాలు, ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా దుయ్యబట్టారు. వీరి ఆరోపణలపై అధికార యంత్రాంగం, అధికార పార్టీ నాయకులు ఇప్పటి వరకూ స్పందించక పోవడం ప్రజల్లో చర్చనీయాంశం గా మారింది. ఎవరు అధికారంలో ఉంటే వారే అక్రమాలకు పాల్పడి తమ నాయకులను ఎన్నుకునేలా చేస్తారన్న విమర్శలు కూడా లేకపోలేదు. (ఎవిడి శర్మ)

రాష్ట్ర బడ్జెట్‌లో పల్నాడుకు తీరని అన్యాయం

సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులేవి? : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి విమర్శించారు. శనివారం నరసరావుపేట పట్టణం గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది అమలు చేయాల్సిన పథకాలను విస్మరించిందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా 80 లక్షల మంది విద్యార్థులకు రూ .13,113 కోట్లు అవసరం ఉంటే రూ .9407 కోట్లు మాత్రమే కేటాయించా రని 24 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. 55 లక్ష మంది రైతులకు రూ .10717 కోట్ల అవసరం అయితే బడ్జెట్ లో 6,300 కోట్లు అవసమన్నారు. కేటాయించిన నిధులు ద్వారా 22 లక్షల మంది రైతులకు మొండిచేయి చూపారన్నారు. దీపం పథకానికి రూ 4 వేల కోట్లు అవసరం కాగా రూ 2,600 కోట్లు కేటాయించారని 1.50 కోట్ల దీపం కుటుంబాలు ఉంటే 90 లక్షల మందికి మాత్రమే కేటాయించారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా 4.30 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామని అసత్య ప్రచారాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఉచిత బస్, ఎస్.సి, ఎస్.టి ,బీసి మహిళలకు 50 ఏళ్లకే పెన్షన్, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఏడాదికి రూ 18 వేలు మెగా డి.ఎస్.సి, పీఆర్సి ఊసే లేదన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్ పరిశీలిస్తే కూటమి ప్రభుత్వానికి రైతులపై ఉన్న చిత్తశుద్ధ తేటతెల్లమైందన్నారు.

పల్నాడుకు మణిహారం అయిన వరికపూడిశెల ప్రాజెక్టు కేంద్రం వద్ద నుంచి అన్ని అనుమతులు తీసుకున్న తీసుకున్నప్పటికీ ప్రస్తుత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే వరికపూడిశెల ప్రాజెక్టు పనులు మొదలు పెడతామన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తామని గోదావరి జలాలను బొల్లాపల్లి మండలం దగ్గర రిజర్వాయర్‌లో కలుపుతామని అక్కడినుండి పెన్నా నదికి తీసుకు వెళతామని చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ పూర్తయితే వరికపూడిశెల అవసరం లేదని పల్నాడు ప్రజలను అయోమయంలో పడేశారన్నారు. బనకచర్లకు రూ 1 లక్ష కోట్ల అవసరం ఉందని ఈ బడ్జెట్ కేటాయించిన రూ 200 కోట్లతో డిపిఆర్ కూడా పూర్తికాదన్నారు. వెనుకబడిన వెల్దుర్తి ,బొల్లాపల్లి పుల్లలచెరువు మండలాలలోని 100 గ్రామాలకు పైగా తాగునీరు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వరికపూడిశెలకు ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేసి టెండర్లు పిలిచి ప్రస్తుతం పథకాన్ని అటకెక్కించారన్నారు. ప్రజా, రైతాంగ సమస్యలు పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి మభ్యపెట్టే బడ్జెట్ అని మండిపడ్డారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరాకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర బిఆర్ స్టేడియం రిజర్వాయర్ పైప్‌లైన్ లీకు మరమ్మతులను, డొంకరోడ్, మూడు వంతెనల వద్ద జరుగుతున్న పనులను, నగరాల్లో పింఛన్ పంణీని, అమరావతి రోడ్డు, ఐడి హాస్పిటల్ వద్ద అన్న క్యాంటిన్‌ను పరిశీలించి లోని 3 వంతెనల వద్ద జరుగుతున్న వంతెన పనులను, నగరాల్లో పింఛన్ పంపిణీని, అమరావతి రోడ్ ఐడి హాస్పిటల్ వద్ద అన్న క్యాంటీన్‌ని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో నగరంలో త్రాగునీటి సరఫరాలో ఏ సమస్య రాకుండా ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం మూడు వంతెనల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి, రైలుపేట నుండి వచ్చే డ్రైన్ నీటిని నేరుగా మేజర్ డ్రైన్‌లో విలీనం చేసేలా నూతన కల్వర్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, 3 వంతెనల వద్ద పెండింగ్ పనులు పూర్తి చేయటానికి రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని జిఎంసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరాల్లో పింఛన్ పంపిణీలో పాల్గొని సచివాలయ కార్యదర్శులు పింఛన్‌దారుల ఇంటి వద్దకే వెళ్లి అందించాలన్నారు. అనంతరం అమరావతి రోడ్ ఐడి హాస్పిటల్ వద్ద అన్న క్యాంటీన్‌లో స్థానికులతో కలిసి టిఫిన్ చేసి ఆహార నాణ్యత గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ అభిప్రాయం నమోదు చేశారు.ప్రతి రోజు క్యాంటీన్‌కి వచ్చే వారి సంఖ్యకు అనుగుణంగా ఆహారం తెప్పించుకోవాలని, ఏఒక్కరికీ ఆహారం అందలేదని ఫిర్యాదు రాకూదని సిబ్బందికి స్పష్టం చేశారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈలు నాగభూషణం, కళ్యాణరావు, ఏసిపి మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

మూడు వంతెనల వద్ద డ్రైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్